పూల సాగుతో లాభాలు

- 50 శాతం సబ్సిడీ అందిస్తున్న ఉద్యానశాఖ
- రైతులు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్న అధికారులు


నర్సాపూర్‌లో పూల సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారి మౌనిక

మామడ: మండలంలోని పలువురు రైతులు మూస ధోరణిలో సంప్రదాయ పంటలు పండించకుండా.. వినూత్నంగా పూలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా ఉన్న వివిధ రకాల పూలతోటలు పెంపకం చేపట్టి ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్లల్లో ఏయే చిన్న శుభకార్యం ఏర్పాటు చేసినా.. పూలు తప్పనిసరి అయ్యాయి. కానీ ఎక్కువశాతం ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు పూలు వస్తుండటంతో ఇక్కడ డిమాండ్ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో లాభాలొచ్చే పూలసాగు వైపు జిల్లా రైతులకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తుచారు ఉద్యానశాఖ అధికారులు. దీంతో క్రమక్రమంగా పూలసాగు పెరుగుతోంది.

జిల్లాలో..

జిల్లాలో కడెం, దస్తురాబాద్, నర్సాపూర్(డబ్ల్యూ), చిట్యాల్, నిర్మల్, భైంసా, పొన్కల్, ముధోల్ ప్రాంతాల్లో పూలతోటలు సాగు చేస్తున్నారు. గులాబీ, బంతి, మల్లె, చామంతి తోటలను సాగు చేస్తున్న వారికి యూనిట్‌పై 50శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రోత్సాహం ఇలా..

బంతి సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.6,400 చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. భూమిని చదును చేసుకుని మొక్కలు నాటిన 60 రోజుల నుంచి పూల దిగుబడులు మొదలవుతాయి. 130 నుంచి 150 రోజుల వరకు పంటకాలం పూర్తవుతుంది. ఎకరంలో బంతి తోట సాగుకు ఖర్చు రూ.50వేలు రాగా.. 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. సాధారణంగా కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు ధర ఉంటుంది. ఎకరాకు 10 టన్నుల దిగుబడి రాగా రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పండుగల సందర్భంగా కిలో పూలు రూ.వంద కూడా పలుకుతున్నాయి. ఖర్చులు పోను ఎకరాకు రూ.రెండు లక్షల వరకు ఆదాయం వస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

తక్కువ పెట్టుబడి..



నేను అర ఎకరంలో బంతి తోట సాగు చేస్తున్నాను. శుభ కార్యాల వేళ వినియోగదారులకు నేరుగా విక్రయిస్తా. మిగతా సమయాల్లో మార్కెట్‌లో దళారులకు అమ్ముతున్నా. అర ఎకరంలో సాగుకు రూ.10వేలు వ్యయం కాగా ఆదాయం రూ.60 వేలు వచ్చింది.

– రాజేశ్వర్, పొన్కల్

పూల సాగుతో లాభాలు



ప్రస్తుతం పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ పెట్టుబడి అవుతుండటంతో అర ఎకరంలో పూల తోట సాగు చేశాం. మంచి లాభాలు వచ్చాయి. పూలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందించి ప్రోత్సహించాలి.

– సుశీల, నర్సాపూర్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పూలతోటలు సాగు చేసి ఆదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం పూలతోటలు సాగు చేసే రైతులకు యూనిట్‌పై 50శాతం సబ్సిడీ అందించి ప్రోత్సహిస్తుంది. పూల తోటల సాగుకు ఆసక్తి కల్గిన రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి.

– మౌనిక, ఉద్యానశాఖ నిర్మల్ డివిజన్ అధికారి

మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ


ముధోల్: మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ముధోల్: బాసర ట్రిపుల్‌ఐటీ పర్యటన ముగించుకొని వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు బాసర–భైంసా జాతీయ రహదారిపై వినతులు వెల్లువెత్తాయి. ముధోల్ కంటి ఆసుపత్రి ముందు పలువురు బాధితులు తమ సమస్యలను కాగితాలపై రాసి మంత్రికి విన్నవించారు. మంత్రి తన కాన్వాయిని ఆపి ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముధోల్‌కు చెందిన వాగ్మారే పుష్ప మాట్లాడుతూ.. తన భర్త వాగ్మారే జనార్దన్‌తో కలిసి తిరుపతికి వెళ్లి వస్తుండగా గూడురు స్టేషన్‌లో తప్పిపోయాడన్నారు. 75 రోజులుగా తన భర్త ఆచూకీ తెలియడం లేదని.. సమస్య పరిష్కరించాలని గోడు వెల్లబోసుకుంది.

ఖానాపూర్: నియోజకవర్గంలో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి నందిరామయ్య.. శుక్రవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించి ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ సెర్ప్ విభాగంలో ఏపీఎంగా పని చేసే గంగన్న ఇటీవల మృతి చెందారు. నిర్మల్ సెర్ప్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ 1.25 లక్షలను డీడీ రూపంలో శుక్రవారం మంత్రి సీతక్క చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు జాదవ్ రవీందర్ నాయకులు రాజేశ్వర్ జ్ఞాను, రమణారావు నరసయ్య ఏపీఎంలు పాల్గొన్నారు.

దత్తసాయి జయంతి ఉత్సవాలు


కుంటాల : మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు


నిర్మల్‌లో కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కుంటాల: దత్తజయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో శుక్రవారం బబ్రూ మహరాజ్ ఆధ్వర్యంలో మహాయజ్ఞం ప్రారంభించారు. శ్రీ మహా పాశుపత హోమం, శ్రీ విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, మండపారాధన, శ్రీ దత్తాత్రేయ స్వామి అభిషేకం, అగ్నిప్రతిష్ఠ, మహాత్ముల దివ్య ప్రవచనాలు, పూజలు జరిపించారు. గోవా మహరాజ్ దేశాయ్ గు రూజీ ఆలయం సందర్శించి పూజలు చేశారు. భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అఖండ సాయి నామం

నిర్మల్‌టౌన్: దత్త జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని గండిరామన్న దత్త సాయి ఆలయంలో శుక్రవారం అఖండ సాయి నామం కనుల పండువగా నిర్వహించారు. 48 గంటలపాటు అఖండ సాయినామ పారాయణం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాయిరథం ఊరేగింపు ఉంటుందని ఆలయ పూజారులు తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


పెంబి మండలం ఇటిక్యాలలో బెల్లం పానకం పారబోస్తున్న అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల్లోని గుడుంబా స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఖానాపూర్ మండలంలోని సేవ్యానాయక్ తండాతో పాటు పెంబి మండలంలోని ఇటిక్యాల, పెంబి తండా, ఇటిక్యాల తండాల్లో దాడులు నిర్వహించి రెండు కేసులు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా 5 లీటర్ల నాటుసారా, 320 కిలోల నల్లబెల్లం, 35 కేజీల పటికను స్వాధీనం చేసుకోవడంతో పాటు 200ల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింధు, గజేందర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన ఎన్ఆర్ఐ

ఖానాపూర్: అమెరికాలోని గ్రేటర్ అట్లాంట తెలంగాణ సంఘం, తాజా మాజీ అధ్యక్షుడు, నిర్మల్ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల కేంద్ర వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ శుక్రవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. బహుజనుల సంక్షేమం ఎమ్మెల్సీ పోరాడుతున్న తీరు అభినందనీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సన్మానించారు.

అమరవీరులకు నివాళులు

కుంటాల: భారత పార్లమెంటుపై 2001లో జరిగిన దాడిలో అసువులు బాసిన అమరవీరులకు కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు. సైనికుల వేషధారణలో విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళాశాలకు వచ్చేలా చూడాలి

లోకేశ్వరం: విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ గౌతమ్ అన్నారు. శుక్రవారం లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రోజు పిల్లలకు కొంత సమయం కేటాయించుకొని వారి చదువు, బాగోగులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విఠల్, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, ప్రమీలరాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, హరీశ్ ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ గ్రామ శివారులో ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి మౌనిక మాట్లాడుతూ నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు, రాయితీ గురించి మామడ, లక్ష్మణచాంద మండలాల రైతులకు వివరించారు. జిల్లాలో 8వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారని.. వచ్చే జూన్ నెల నుంచి తొలి పంట చేతికి వచ్చే అవకాశం ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతూ టన్ను ఆయిల్‌పాం గెల ధర రూ.20,400కు చేరిందని కచ్చితమైన మద్దతు ధర కల్పించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ మనోజ్‌రెడ్డి, క్రాప్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి, ఉద్యాన అధికారులు దేవన్న, ఫీల్డ్ ఆఫీసర్ శశాంక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొరిటికల్‌లో..

మామడ: మండలంలోనిక కొరిటికల్ గ్రామంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి వసంత్‌రావు, ఏరియా మేనేజర్ మనోజ్ రెడ్డి, క్రాప్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి, దేవన్న ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ప్రతిభ


ఉపాధ్యాయ బృందంతో విజేతలు

సారంగపూర్: మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈసందర్భంగా మండలస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రిజ్వాన్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

‘విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి’


బీఆర్ఎస్ నాయకులతో పోలీసులు

ఖానాపూర్: ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలో మృతి చెందిన విద్యార్థిని శైలజ కుటుంబాన్ని ఆదుకోడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్‌వీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి సీతక్క.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లో హత్యకు గురైన అలేఖ్య కేసుపై విచారణ చేయించి.. నిందితుడికి శిక్ష విధించాలని కోరారు. ఈ ఘటనలపై మంత్రి సమాధానం చెప్పకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దివాకర్, సుమిత్, మహిపాల్, ప్రణీత్, రాజు, లాజర్, అర్షద్, రవి, వంశీ, షోయబ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు...

మంత్రి సీతక్క పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రకటించడంతో పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఉన్నవారిని అక్కడికక్కడే దస్తురాబాద్ ఎస్సై శంకర్ హౌస్ అరెస్టు చేశారు. శ్రావణ్, సుమిత్, ప్రణీత్, షఫీ, మహిపాల్, శ్రీకాంత్, షఫీ అర్శద్, లాజర్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై శిక్షణ


నర్సాపూర్ (జి) రైతువేదికలో సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్న వెంకటేశ్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై శిక్షకులు వెంకటేశ్ సర్వేయర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలను మొబైల్‌యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. 500 దరఖాస్తులకో సర్వేయర్ ఉంటారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

16నుంచి సర్వే

తానూరు: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 16 నుంచి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎంపీవో నసీరుద్దీన్ సూచించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయి కి వెళ్లి.. లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీజేపీతో అన్నిరంగాల్లో అభివృద్ధి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: బీజేపీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. వారి వెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, కౌన్సిలర్ గౌతం పింగ్లే, బీజేపీ నాయకులు, స్వర్ణకార సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు


పంట పరిశీలిస్తున్న ఏవో వినోద్‌కుమార్

సోన్: మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగుమందులను పంటలపై వాడొద్దని ఏవో వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్ధిలకుంటలో మొక్కజొన్న చేన్లను ఏవో పరిశీలించి మాట్లాడారు. ఎకరం మొక్కజొన్న చేనుకు 4 బస్తాల యూరియా సరిపోతుందన్నారు. నానో యూరియా వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములను ఎకరం చేనులో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితుల గుర్తింపునకు సర్వే


పట్టణంలో సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

భైంసాటౌన్: భైంసా పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం రాత్రి వైద్య బృందం బోదకాలు(ఫైలేరియా) బాధితుల గుర్తింపునకు సర్వే చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇద్రిజ్ ఫౌరీ ఆదేశాల మేరకు రాత్రి తొమ్మింది గంటల నుంచి ఒంటి గంట వరకు ఇంటింటికీ తిరిగి రక్తనమూనాలు సేకరించారు. డివిజన్‌వ్యాప్తంగా 18 బృందాలతో దాదాపు 5,400 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. సేకరించిన నమూనాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. పట్టణంలో అర్బన్, మహాగాం పీహెచ్‌సీ వైద్యురాలు డా ఫిర్దోస్ జబీన్, హెచ్ఈవో కలీమొద్దీన్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్‌లో గురువారం రాత్రి కడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫైలేరియా సర్వే నిర్వహించారు. 300 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు డాక్టర్ రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, రాజేశ్వర్, కొమురయ్య, నర్సయ్య తదితరులున్నారు.



జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం మంత్రి చాయ్ పోసి గ్లాస్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అందించారు. మంత్రి చాయ్ ఇవ్వడంతో అక్కడున్నవారంతా చిరునవ్వులు చిందించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

లోకేశ్వరం: లోకేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. ఖానాపూర్, సుర్జాపూర్, పాతఎల్లాపూర్, సత్తనపల్లి, బీర్నంది సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని..వినియోగదారులు సహకరించాలని కోరారు.

జామ్ గురుకుల ప్రిన్సిపాల్‌గా సంగీత



సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులం ప్రిన్సిపాల్‌గా సంగీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాధిక పోచంపాడ్ కళాశాలకు వెళ్లారు. నూతన ప్రిన్సిపాల్‌కు సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు.

బీజేపీ బలోపేతానికి కృషి


బూత్ కమిటీని ప్రకటిస్తున్న నాయకులు

కడెం: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం మహేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్‌కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కట్కూరి భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ శశాంక్‌ను ఎన్నుకున్నారు. ఇందులో సత్తెన్న, గంగాధర్, రాజేందర్, కృష్ణ, తిరుమల్, శ్రీరాం, రాజేశ్, తదితరులున్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం సుజాత విద్యార్థులకు సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానం


నారాయణ(ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన అమరగోని నారాయణగౌడ్ (74) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం తన నివాసంలో మృతి చెందాడు. నారాయణగౌడ్ కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన వెంకటరమణ తండ్రి నేత్రాలను దానం చేస్తున్నట్లు ప్రకటించాడు. ఆదిలాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వారు నేత్రాలను సేకరించారు. వెంకటరమణను భారత నాస్తిక సమాజం నాయకుడు బొమ్మెన రాజ్‌కుమార్, కౌన్సిలర్ కారింగుల సంకీర్తనసుమన్, పట్టణ వాసులు అభినందించారు.

వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న నాయకులు

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామానికి చెందిన వెల్మల ప్రియాంక, అరుగుల శైలజ ప్రభుత్వ వైద్యులుగా నియమితులయ్యారు. శుక్రవారం వారిని గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుమ్ముల నర్సయ్య, సభ్యులు అశోక్, నాయకులు టి. నారాయణ, బి.సాయన్న, చందు, ఆకాశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

108 సేవలు ప్రారంభం


వాహనం ప్రారంభిస్తున్న అధికారులు

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని శుక్రవారం అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ లింగంమూర్తి మాట్లాడుతూ గతంలో మండలానికి 108 వాహనం లేక ప్రజలకు సకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడేవారన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అబ్దుల్ కాసీం, వైద్యసిబ్బంది ఉన్నారు.